క్లుప్తంగా

భ్రామరికీ ఊయలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. అలాగే శ్రీశైల గ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

వైఎస్‌ఆర్‌ జయంతి వేడుకలకు హాజరుకండి

ఆత్మకూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలకు ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్‌, రాజమోహన్‌రెడ్డిలు శుక్రవారం తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల మలుపు వద్ద వైఎస్‌ఆర్‌ విగ్రహానికి శనివారం పాలాభిషేకం నిర్వహించనున్నట్లు వారు చెప్పారు.

పగిడ్యాల: వైఎస్‌ఆర్‌ జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ గుజ్జుల రమేష్‌ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులకు సూచించారు. వైఎస్సార్‌ విగ్రహాలకు పాలాభిషేకాలు చేసి ఘనంగా నివాళులర్పించి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

పాడికి ప్రోత్సాహం

వెలుగోడు: ప్రభుత్వం పాడి పశువుల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్‌ రాజశేఖర్‌ అన్నారు. మోతుకూరు గ్రామంలో శనివారం మేలు జాతి లేగ దూడల ప్రదర్శన నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌ రాజశేఖర్‌ మాట్లాడుతూ పాడి పశువుల్లో సకాలంలో ఎద లక్షణాలు గుర్తించి గోపాలమిత్ర ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించుకోవాలన్నారు. పశుగణాభివృద్ధి సంస్థ రైతులకు కావలసిన మేలు జాతి ఆంబోతుల వీర్యం సరఫరా చేస్తుందన్నారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమం వెలుగోడు ఏడీ ధనుంజయుడు, డాక్టర్‌ రాజశేఖరరెడ్డి, డాక్టర్‌ సుధాకర్‌రెడ్డి, జోత్స్నదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రసీదులు ఇవ్వాలి

వెలుగోడు: ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రసీదులు ఇవ్వాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ సూచించారు. శనివారం ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులతో నిర్వహించిన సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ అనుమతి పొందిన విత్తనాలు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పలు రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇచ్చారు. బోయరేవుల రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి చైర్మన్‌ రవీంద్రరెడ్డి, మండల వ్యవసాయ అధికారి పవన్‌ కుమార్‌ హాజరయ్యారు.

ఈపీఎఫ్‌ అమలు చేయాలి

వెలుగోడు: గ్రామ పంచాయతీ కార్మికులకు ఈపీఎఫ్‌, ఈఎస్‌ఐ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం డిమాండ్‌ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్‌ వర్కర్స్‌ యూనియన్‌ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు 2012 నుంచి ఈపీఎఫ్‌, ఈఎస్‌ఐ అమలు చేయాలని ఆదేశాలున్నా ఎక్కడా అమలు కాలేదన్నారు. సమావేశంలో పంచాయతీ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీనివాసులు, పంచాయతీ వర్కర్స్‌ నాయకులు నాయకులు జాన్‌ శిఖామణి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం



మాట్లాడుతున్న జిల్లా నాయకులు

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణ సాధించేంతవరకు ఉద్యమం ఆగదని ఎమ్మార్పీఎస్‌ జిల్లా నాయకులు ప్రేమరాజు, తోట ప్రభాకర్‌ మాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలో డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద మాదిగ రిజర్వేషన్‌ పోరాట సమితి ఆవిర్భావ వేడుకలు, మందకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌ చేసి సంబరాలు జరుపుకున్నారు. వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీ ఎస్‌ నాయకులు ప్రసాద్‌, నాగరాజు పాల్గొన్నారు.

వెలుగోడు: ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్‌ జిల్లా కార్యదర్శి వాదం నాగేషులు సమితి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలు ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.ఆరోగ్యం మాదిగ, వెంకటేశ్వర్లు, పుల్లంరాజు, నాగరాజు, ప్రహ్లాద్‌, శివ, సుబ్బరాయుడు, లక్ష్మన్న, యేసేపు పాల్గొన్నారు.

జలసిరి ప్రదాత వైఎస్సార్‌

- వైఎస్‌ఆర్‌ హయాంలో 5 ఎత్తిపోతల పథకాలు మంజూరు
- నాటి మెట్ట భూముల్లో నేడు సిరుల పంటలు
- నేడు మహానేత జయంతి

దివంగత నేత వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి జలసిరి ప్రదాతగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. నాటి ఆత్మకూరు డివిజన్‌ పరిధిలో లింగాల, ఇస్కాల, చెలిమెల్ల, సిద్ధాపురం, శివపురం ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసి 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతన్నల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిన ఘనత ఆయనది. మహానేత జయంతి సందర్భంగా ఆయన పథకాలను గుర్తు చేసుకుందాం. – ఆత్మకూరు



సిద్ధాపురం చెరువు కింద కళకళలాడుతున్న వరి పంట(ఫైల్‌)



నిండుకుండలా సిద్ధాపురం చెరువు (ఫైల్‌)



నల్లకాల్వలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌ స్మృతివనంలో వైఎస్సార్‌ విగ్రహం

సిద్ధాపురం ఎత్తిపోతల పథకం
సాగునీరు అందుతున్న గ్రామాలు: సిద్దాపురం, సిద్ధపల్లి ముష్టపల్లి, కరివేన, నల్లకాల్వ, బావనంతపురం, కొత్తరామాపురం, భానుముక్కల, ఎర్రగూడూరు.
సాగు విస్తీర్ణం: ఆత్మకూరు, పాములపాడు మండలాల్లోని దాదాపు 10 గ్రామాల్లో 21 వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందుతుంది. పంట కాల్వ పూర్తయితే పూర్తి స్థాయిలో ఈ పథకం ద్వారా రైతులకు మరింత సాగు నీరు అందుతుంది.

చెలిమెల్ల ఎత్తిపోతల పథకం
సాగునీరు అందుతున్న గ్రామాలు: చెలిమెల్ల, దుద్యాల, ఇస్కాల
సాగు విస్తీర్ణం: ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లోని పైగ్రామాల్లో 2 వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందుతుంది. ఈ ప్రాంతం అంతా మెట్ట భూములు, నేడు సిరుల పంటలు కురుస్తున్నాయి.

లింగాల ఎత్తిపోతల పథకం
సారు నీరు అందుతున్న గ్రామాలు: లింగాల, నాగంపల్లి, కొక్కెరంచ, లింగాపురం
సాగు విస్తీర్ణం: 4 వేల ఎకరాల్లో సాగు నీరు అందుతుంది.

శివపురం ఎత్తిపోతలపథకం
సారు నీరు అందుతున్న గ్రామాలు: శివపురం, ముసలిమడుగు, చిన్నగుమ్మడపురం, సింగరాజుపల్లి
సాగు విస్తీర్ణం: ఈ పథకం ద్వారా 3 వేల ఎకరాలకు నీరు అందుతుంది.

ఇస్కాల ఎత్తిపోతల పథకం
సాగునీరు అందుతున్న గ్రామాలు: ఇస్కాల, దుద్యాల, కరివేన
సాగు విస్తీర్ణం:2,000 ఎకరాలకు నీరు అందుతుంది.

కరువుతో అల్లాడేవాళ్లం



వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయకపోయి ఉంటే కరువు, కాటకాలతో అల్లాడేవాళ్లం. ఏటా వలస వెళ్లి జీవించాల్సిన పరిస్థితి ఉండేది. ఆయన ప్రవేశపెట్టిన ప్రాజెక్ట్‌ల వల్ల ప్రస్తుతం నీరు అందుతుంది. రెండు పంటలు పండించుకూ జీవనం గడుపుతున్నాం.
– విష్ణువర్ధన్‌రెడ్డి, సిద్దాపురం

రెండుపంటలు పండిస్తున్నాం



సిద్ధాపురం చెరువు కింద రెండేళ్ల నుంచి ఏటా రెండు పంటలు పండిస్తున్నాం. ఎత్తిపోతల పథకం మంజూరు కాకపోయి ఉంటే కరువు కాటకాలతో ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం ఎత్తిపోతల పథకంతో సిద్దాపురం చెరువులో పూర్తి స్థాయిలో నీరు ఉంది. ఈ నీటితో రెండవ పంట కూడా పుష్కలంగా పండుతుంది. ఈ పథకం మంజూరు చేసిన దివంగత నేత వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డిని స్మరించుకుంటున్నాం.
– శివశంకర్‌నాయక్‌, ఎస్‌ఎస్‌ తండా





అమ్మవారిని అలకరించిన భక్తులు, అమ్మవారికి ఒడి బియ్యం సమర్పిస్తున్న మహిళా భక్తులు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

నందికొట్కూరు: పట్టణంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరిదేవికి ఆషాడమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని నూతన దుస్తులతో అలకరించి,ఒడిబియ్యం,సారె సమర్పించారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చి,భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జగజ్జననీ సల్లంగా చూడమ్మా!



జగజ్జననీ అమ్మవారికి చీరసారె తెస్తున్న భక్తులు

మహానంది: జగజ్జననీ సల్లంగా చూడమ్మా అంటూ పార్నపల్లె గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం, శుక్రవారం కావడంతో పార్నపల్లె గ్రామానికి చెందిన మహిళలు, భక్తులు గ్రామం నుంచి చీర, సారె తీసుకెళ్లారు. మేళతాళాల మధ్య భక్తిశ్రద్ధలతో ముందుగా గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి చీర, సారె తీసుకెళ్లి నంద్యాలలోని జగజ్జననీ ఆలయంలో అమ్మవారికి సమర్పించారు.

భూముల ధరపై స్పష్టత ఇవ్వాలి



కర్నూలు-గుంటూరు రహదారిపై రైతులు చేస్తున్న రాస్తారోకోతో స్తంభించిన రాకపోకలు

జూపాడుబంగ్లా: నేషనల్‌హైవే 340సీ రోడ్డు నిర్మాణంలో భూసేకరణలో భూముల ధరలపై స్పష్టత ఇవ్వాలని రైతులు డిమాండ్‌ చేశారు. ఈ విషయమై శుక్రవారం మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలోని క్వార్టర్స్‌తో కర్నూలు-గుంటూరు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంట పాటు రైతులు చేసిన రాస్తారోకోతో కేజీరోడ్డుపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ఈ సందర్భంగా పలువురు బాధిత రైతులు మాట్లాడుతూ తర్తూరు, మండ్లెం, తంగడంచ, జూపాడుబంగ్లా, 80బన్నూరు గ్రామాల్లోని కొంత మంది రైతులకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేసిన అధికారులు ఒక్కొక్కరికి ఓ విధంగా నగదు జమచేయటం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం తహసీల్దార్‌ పుల్లయ్య యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు.

కడమలకాల్వలో వైద్య శిబిరం

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలో అతిసారం ప్రబలడంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు నంద్యాల జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్‌ వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వైద్యులతో కలిసి గ్రామంలో పర్యటించారు. డాక్టర్‌ వెంకటరమణ మాట్లాడుతూ సచివాలయం వద్ద నారాయణాపురం పీహెచ్‌సీ వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నారని, అతిసార లక్షణాలు ఉంటే వైద్య సేవలు పొందాలన్నారు. ప్రజలు నీటిని కాచి వడగట్టుకుని తాగాలని సూచించారు. ఆహారపదార్థాల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నంద్యాలకు చెందిన డాక్టర్లు కాంతారావు నాయర్‌, అనిత, వినయ్‌లు అందుబాటులో ఉంటారన్నారు. అలాగే 108 వాహనం అందుబాటులో ఉంటుందన్నారు.

ఆర్డీటీ ప్రతినిధులతో పీఓ సమావేశం




విశాల్‌ఫెర్రర్‌ను సన్మానిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్‌: చెంచుగిరిజనులు, వెనుకబడిన వర్గాల ప్రజలకు నివాసగృహాలను నిర్మిస్తూ ఆదుకుంటున్న విన్‌సెంట్‌ఫెర్రర్‌ స్థాపించిన రూరల్‌ డెవలప్‌మెంట్‌ ట్రస్ట్‌ ప్రతినిధులను శుక్రవారం ఐటీడీఏ ప్రాజెక్ట్‌ అధికారి దార్ల బి రవీంద్రారెడ్డి సత్కరించారు. ఆర్డీటీ ప్రతినిధి విశాల్‌ఫెర్రర్‌ను పీఓ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఐటీడీఏ పరిధిలోని చెంచుగిరిజనుల గూడేల్లో వారికి గృహాలను నిర్మిస్తూ నివాసయోగ్యాన్ని కల్పిస్తున్నందుకు వారిని ఈ సందర్భంగా సన్మానించారు. గృహాల నిర్మాణంలోనే కాకుండా స్వయం సహాయక ఉపాధి కల్పన కార్యక్రమాల్లో ఆర్డీటీ ప్రతినిధులు సహకరించాలని పీఓ రవీంద్రారెడ్డి వారిని కోరారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మిడుతూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తలముడిపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్‌ మద్దిలేటి సూచించారు. శుక్రవారం గ్రామంలో డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాధి లక్షణాలు, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలం ఆరంభమైనందున సీజనల్‌ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్‌ సూపర్‌వైజర్‌ విలాస కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్‌



నిందితులను అరెస్టు చూపుతున్న రూరల్‌ సీఐ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: ప్రభుత్వ వైన్‌షాప్‌లో చోరీ ఘటన నిందితులును పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రూరల్‌ సర్కిల్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సుధాకర్‌రెడ్డి వివరాలను విలేకరులకు వెల్లడించారు. జూపాడుబంగ్లా మండల కేంద్రంలోని ప్రభుత్వ వైన్‌షాపులో మే 10న రాత్రి చోరీ జరిగింది. వైన్‌షాప్‌ పైకప్పు రేకులను కట్టర్‌తో కట్‌ చేసి లోపలికి చొరబడ్డారు. క్యాష్‌ బాక్స్‌లో రూ.3,07,340 నగదుతో ఉడాయించారు. సూపర్‌వైజర్‌ తెలుగు పరమేష్‌ ఫిర్యాదు మేరకు జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు డీఎస్పీ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టారు. జూపాడుబంగ్లా కేసీ కెనాల్‌ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒకే స్కూటీపై వెళ్తున్న పల్నాడు జిల్లా కారంపూడి మండల కేంద్రానికి చెందిన బొట్ట మణికంఠరెడ్డి, పూల మణికుమార్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. రూ.2.10 లక్షలు, స్కూటీ, యాక్సెస్‌ బ్లేడ్‌, కట్టర్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

అందరికీ రక్ష.. జగనన్న సురక్ష

- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



నూతన దంపతులకు మ్యారేజ్‌ సర్టిఫికెట్‌ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలం ప్రాజెక్ట్‌: కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి పేదవాడికీ జగనన్న సురక్ష కార్యక్రమం రక్షగా నిలుస్తోందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శుక్రవారం సున్నిపెంటలోని సచివాలయం–1లో జగనన్న సురక్ష సదస్సు నిర్వహించి 401 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏదైనా సర్టిఫికెట్‌ కావాలంటే రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఒక్కోసారి మధ్యవర్తులకు డబ్బు చెల్లించుకోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ప్రతి సేవా ఉచితంగా, అత్యంత తక్కువ సమయంలో, పారదర్శకంగా లబ్ధిదారుల ముంగిటకే చేర్చడం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే సాధ్యమైందన్నారు. రేషన్‌ కార్డులు, కుల, ఆదాయ, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు మొత్తం 11 రకాల సేవలు సురక్ష సదస్సులో అందజేస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహనకృష్ణ, తహసీల్దార్‌ రాజేంద్రసింగ్‌, పంచాయితీ కార్యదర్శి బాలూనాయక్‌, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్‌ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ రజాక్‌, బీసీ సెల్‌ కార్యదర్శి జింకా గుండయ్య యాదవ్‌, మండల నాయకులు జూటూరి మహమ్మద్‌ఖాశీం, టీఎండీ రఫీ, ఆసాది ప్రవీణ్‌ దివ్య తేజ, భరత్‌రెడ్డి, ఏసు, దానియేల్‌, గౌస్‌మొహిద్దీన్‌, ముస్తఫా, ప్రభావతి పాల్గొన్నారు.

పనిచేయని వలంటీర్లు మానుకోండి
విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న వలంటీర్లు తక్షణమే స్వచ్ఛందంగా వైదొలగాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. జగనన్న సురక్ష సదస్సుకు 11 మంది గ్రామవలంటీర్లు గైర్హాజరు కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వారిని తొలగించి నోటిఫికేషన్‌ ద్వారా వేరేవారికి అవకాశంఇవ్వాలని ఎంపీడీఓకు ఎమ్మెల్యే సూచించారు.

ఎమ్మెల్యేకు సత్కారం
మండలంలో ముస్లింల షాదీఖానా అభివృద్ధికి రూ.కోటి, ఖబరస్తాన్‌ మార్గానికి సిమెంట్‌ రోడ్డు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ముస్లిం మైనార్టీ వర్గాలు సత్కరించారు. ఏపీ జెన్‌కో అతిథి గృహంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్‌ అధ్యక్షులు ఎండీ ఇస్మాయిల్‌, మైనార్టీ నాయకులు ఎఫ్‌ఎ జవాద్‌, నూర్‌మహమ్మద్‌, హఫీజ్‌ , ఖాసీం, మౌలాన, ఆరీఫ్‌ మౌలానా, షిదాయితుల్లా, ఆసర్‌ఇస్మాయిల్‌, మగ్బుల్‌, ముస్తఫా పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి



ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డును పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రాథమికోన్నత పాఠశాలకు, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు బొల్లు ప్రసాద్‌ బాబు యాదవ్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం ఎర్రమఠం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలోనే అంగన్‌వాడీ సెంటర్‌ నిర్వహిస్తున్నారన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు బురదలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలం వచ్చిందంటే నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డును మంజూరు చేయాలని వారు డిమాండ్‌ చేశారు.

ఈ రోజు

భూసార పరీక్షా కేంద్రం ప్రారంభం
నందికొట్కూరు రూరల్‌: నియోజకవర్గ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌ శనివారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద ఇంటిగ్రేటెడ్‌ అగ్రి ల్యాబ్‌ను ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి షేక్షావలి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలన్నారు.

ఎమ్మెల్యే రాక
పాములపాడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి జయంతి వేడకల నిమిత్తం శనివారం ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌ మండల కేంద్రానికి రానున్నట్లు పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

కౌలు కార్డులు తప్పనిసరి

కొత్తపల్లి: పొలాలను కౌలుకు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వ పథకాలు అమలు కావాలంటే కౌలు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని ఏఓ కె.మహేష్‌ సూచించారు. నందికుంట ఆర్బీకేలో అగ్రీ అడ్వైజర్‌ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలుకు పొలాలు సాగుచేసుకునే రైతులు తప్పకుండా కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. వారికి రైతుభరోసా, పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్‌, ఇతర ప్రభుత్వ సబ్సిడీ పథకాలు వర్తించాలంటే కౌలు కార్డు కలిగి ఉండాలన్నారు. పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేసుకోని వారు ఈనెల చివరిలోగా చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీ చేయించుకోకుండా పీఎం కిసాన్‌ డబ్బు ఖాతాలో జమ కావన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

జూపాడుబంగ్లా: బీసీలు ఐక్యమత్యంగా పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలని బహుజన సమాజ్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ స్వాములు అన్నారు. శుక్రవారం తరిగోపుల గ్రామంలో నిర్వహించిన బీసీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 132 కులాలుగా ఉన్న బీసీలలో ఐక్యమత్యంలేని కారణంగా రాజకీయనాయకులు కులాల మధ్య కుంపట్లు పెట్టి బీసీల సమస్యలు పరిష్కరించటంలో కాలయాపన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్నవెంకటస్వామి, ప్రసన్న, రత్నమయ్య, విజయవర్మ, ప్రశాంత్‌ పాల్గొన్నారు.

ఆక్రమణలు నిరూపించండి

- ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్‌ అబ్దుల్‌ షకూర్‌



మాట్లాడుతున్న ఉర్దూ రాష్ట్ర డైరెక్టర్‌ అబ్దుల్‌ షకూర్‌

నందికొట్కూరు: సెంటూ స్థలం ఆక్రమించినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్‌ అబ్దుల్‌ షకూర్‌ సవాల్‌ చేశారు. శుక్రవారం ఆయన తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కబ్జాలకు పాల్పడిన చరిత్ర తెలుగుదేశం పార్టీకి చెందిన షేక్షావలి, జైనదీన్‌, ఉస్మాన్‌, షాలిబాషా, షేక్‌ అహమ్మద్‌, బాబా ఫక్రుద్దీన్‌లదేనన్నారు. మిడుతూరు మండలం జలకనూర్‌ గ్రామంలో మసీదు మాన్యం 100 ఎకరాలుంటే టీడీపీ నాయకులు ఆక్రమించుకుని పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు. తాను రాజకీయంగా ఎదుగుతుంటే చూసి ఓర్వలేక బురద జల్లుతున్నారన్నారు. 20 సెంట్ల ప్రభుత్వ స్థలంలో నలుగురు వ్యక్తులు పశువుల గడ్డి నిలువ చేసుకున్నారని, ఆ స్థలాన్ని ఆక్రమించడానికి తెలుగుదేశం పార్టీ నాయకులు రాళ్లతో గోడలు కడితే తమ దాయాదులు అడ్డుకున్నారన్నారు. అయినా ఆ సమయంలో అక్కడ తాను లేకపోయినా ఆరోపణలు చేశారని, కోర్టులో పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. సమావేశంలో పాషమియ్య, అబ్దుల్‌ గని, నజీర్‌బాషా, హబిబుల్లా, ఇబ్రహీం పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

పాములపాడు: ధ్యానంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్‌ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో వెంకటేశ్వర దేవస్థానంలో 4 రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయులు అందించిన మహోన్నతమైన వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ధర్మ ప్రచారకులు ఆమంతి వెంకటేశ్వర శర్మ మూడు రోజుల పాటు శ్రీమద్రామాయణ, మహాభారతం, భగవద్గీతలపై ప్రసంగాలిచ్చారు. ప్రజలు ధర్మాన్ని తప్పరాదని వివరించారు. భగవంతుని సన్నిధానంలో ఉండాలని, దైవత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పురోహితులు మామిళ్లపల్లి సదానందశర్మ, గ్రామ పెద్దలు తిమ్మారెడ్డి, రవీంద్రారెడ్డి, హనుమానాయక్‌, కోటినాయక్‌, భజన మండళ్ల అధ్యక్షులు నాగలింగమయ్య, ఆవులయ్య, శ్రీనివాసులు, ఆనందాచారి, మురళిగౌడు, తిమ్మానాయక్‌, చౌడయ్య, ఎల్లసుబ్బడు, భక్తులు పాల్గొన్నారు.